# సింగిల్ పేజీ కథలు

# రాశిఫలం

వంటింట్లో పనంతా ముగించుకుని తీరుబడిగా సంవత్సర ఫలాలు చూస్తున్న పంకజం ఆనందంగా "ఏమండీ! ఈ సంవత్సరం పంచాంగంలో మన రాశిఫలాలు చూశారా? మనకి వాహనయోగం వుందిట" అంది.

"మనకి అంటున్నావు! నీ రాశిఫలంలో వాహనయోగం ఉంటే నాకెలా అవుతుంది?" అన్నాడు పరమేశ్వరం.

"నాకు వాహనయోగం ఉంటే మీకు లేకుండా ఎలా ఉంటుంది? మనిద్దరం ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్తాం కదా!" అంది.

"గొప్ప తెలివే గాని చూడు. నా రాశికి ఆదాయం రెండు, వ్యయం పన్నెండు రాశారు. మనకి వాహనం ఎలా వస్తుంది?"

"అదికాదండీ. అమెరికాలో ఉన్న మన అబ్బాయి మనల్ని కారు కొనుక్కోమని డబ్బు పంపుతాడేమో?" అంది ఆశగా.

"ఆశ! చూడు. ఒక్కసారి మనవల్ని, మిమ్మల్ని చూడాలని ఉంది రండిరా. అంటే ఇప్పుడసలే ఖర్చుగా ఉంది. మేమక్కడికి రావాలంటే బోలెడు డబ్బు అవుతుంది. కావాలంటే ఏదో కొంచెం డబ్బు పంపుతాను. అన్న పెద్దమనిషి మనకి కారుకి సరిపడేంత డబ్బు పంపుతాడా? పంపినా నేను తీసుకుంటానా? తల్లిదండ్రులు ఎలా ఉన్నారో చూడాలని, వారి ఆనందం కోసం కొద్దిరోజులైనా వచ్చి ఉండాలని వాళ్లకి లేదు. అమెరికాలో ఉంటే ఏదో బోలెడు డబ్బు కురుస్తోందనుకుంటున్నావు. ఎంత వచ్చినా అక్కడి ఖర్చులకి సరిపోతుంది. ఇక్కడిలాగే అక్కడా కాస్తో కూస్తో పొదుపు చెయ్యగలిగిన వాళ్ళే కాస్తైనా దాచుకోగలరు. లేకపోతే అప్పులు, తిప్పలు తప్పవు. మనవాడు రెండో కేటగిరీకి సంబంధించినవాడు కదా!" అన్నాడు పరమేశ్వరం.


"ఏమోనండీ! మీరన్నింటికీ ఇలాగే మాట్లాడుతూ ఉంటారు. నన్ను కనీసం ఊహల్లోనైనా ఆనందంగా ఉండనివ్వరు" అంది పంకజం కినుకగా.

"ఉన్నదాంట్లో తృప్తిగా ఆనందంగా ఉండు. వద్దన్ను. లేనివి ఊహించుకుని గాలి మేడలు కట్టుకుని ఆనందిస్తే అవి కూలిపోకతప్పదు. ఏడవక తప్పదు. నాతో ఇన్నాళ్ళు కాపురం చేశావు. నా సంగతి ఇంకా అర్థంకాలేదా?"

"అవకనేం? అయింది. మనకన్నా తక్కువ వాళ్లని చూసి వాళ్లకన్నా మనం బాగున్నాం కదాని తృప్తిపడి ఆనందించమంటారు" అంది.

"అంతేకాదు. ఎక్కువగా ఉన్న వాళ్లని చూసి, వారి భోగాలు మనకి కావాలని కోరుకోకు. అలా కోరితే ఒకనాడు భంగపడకతప్పదు. ఎవరి పరిధిలో వారు ఉండడం మంచిది" అన్నారు పరమేశ్వరం.

"అబ్బబ్బ! అయిందా మీ నీతిబోధ. వినివినీ చెవులు తడికలు కట్టాయి. ఏ ఆశలు, కోరికలు లేకుండా బతకడానికి ఎలా మనసొప్పుతుందండీ. ఇది ఉప్పు, పులుపు తినే శరీరం"



"నేను మాత్రం ఉప్పు, పులుపు తినడం లేదా? నేన లాగొంతెమ్మ కోరికలు కోరుకుంటున్నానా? అలా కోరికలు గుర్రాలై నేను జల్సాగా తిరిగి వుంటే మనం ఈనాడు ఈ మాత్రం సుఖజీవనానికి కూడా నోచుకోక అప్పుల పాలై 'హలో! లక్ష్మణా' అని ఏడవాల్సి వచ్చేది"

"సరేలెండి. ఎరక్కపోయి ఏదో నా సంవత్సర ఫలాలు చదివి ఆనందంగా చెప్పాను. దానికింత రాద్ధాంతం ఎందుకు?"

"రాద్ధాంతం కాదు. సిద్ధాంతం. ఒక్కొక్క రాశిలో ఇంచుమించు మూడు నక్షత్రాల వారుంటారు. ఒక్కొక్క నక్షత్రం వాళ్ళు లక్షల సంఖ్యలో ఉంటారు. వాళ్లందరికీ కలిపి గుంపుగా రాసే సంవత్సరఫలాలు మనకి జరిగిపోతాయని ఆనందించడం, చెడు రాస్తే భయపడి బుర్ర పాడు చేసుకోవడం అనవసరమంటాను" అన్నాడు పరమేశ్వరం.

ఔననక తప్పలేదు పంకజానికి. అయినా తనకొచ్చిన కష్టమేమీ లేదు. ఉన్నంతలో భర్త తనని బాగానే చూస్తున్నాడు. స్వంత ఇల్లు ఉంది. రిటైరయ్యాక పెన్షను వస్తోంది. ఉద్యోగంలో ఉండగా పొదుపు చేసిన డబ్బు, రిటైరయ్యాక వచ్చే డబ్బూ అంతలోనూ ఇద్దరు పిల్లల చదువులకీ, పెళ్ళిళ్లకీ పోగా మిగిలినది బ్యాంకులో వేశాడు. దానిమీద వచ్చే వడ్డీ, పెన్షను కలిపితే తమకి బాగానే సరిపోతుంది. ఏడాదికోసారి అమ్మాయిని పిల్చి దానికీ, పిల్లలకీ ఏదో తమ శక్తికొలదీ అచ్చట, ముచ్చట తీర్చి పంపుతుంటారు. మామకి తగ్గ అల్లుడు. అంచేత ఏ ఇబ్బందులూ లేవు. జీవితం సాఫీగానే సాగిపోతోంది. అంచేత ఆయన చెప్పినట్లు ఏ ఎక్కువ వ్యామోహాలకి పోకుండా ఉండడం మంచిదేనేమో. అయినా ఎప్పుడైనా నడవలేని దూరాలకి వెళ్ళినప్పుడు ఆటోలు, కాల్టాక్సీలు ఉండనే ఉన్నాయాయె. ఇక కారులెందుకు? దండగ! అనుకుని తనకు తానే సమాధానపడింది.

* * *

పండగ పూజ హడావిడి అయింది. ఆరోజు పంకజం పనిమనిషికి పిండివంటలు, అన్నం, కూరలు వగైరా అన్నీ ఇచ్చింది. ఆరోజులన్నీ తీసుకుని మర్నాడు పని మానేసింది. అదంటే పని తప్పించుకుందిగాని తనకి తప్పదు కదా. ఉదయాన్నే వాకిలి కడిగి ముగ్గు వేసుకోవడం, గదులు ఊడ్చుకోవడం, అంట్లు తోమడం, బట్టలు ఉతకడం అన్నీ వరసగా చేస్తూంది. వయసు పైబడుతోంది. హడావిడిగా చేసేటప్పటికి కాళ్ళు తడబడుతున్నాయి. బాత్రూంలో జారి పడిపోయింది. మామూలుగా అయితే పడినా లేచేది. లేవలేకపోయింది. కాలు వ్రేలాడుతోంది.

"ఏమండీ!" అంటూ గట్టిగా అరిచింది. పరమేశ్వరం పరిగెత్తుకొచ్చాడు.

"అయ్యో! ఏమైంది పడిపోయావా? లేపనా. చెయ్యి పట్టుకుంటాను. ఊ! లే!" అన్నాడు.

"లేదండీ! నేను లేవలేను. కాలు విరిగినట్టుంది. ఒంటికాలిమీద లేవాల్సిందే" అంటూ ఒంటికాలుమీద లేచింది భర్త సాయంతో. కుర్చీ తెచ్చి పంకజాన్ని కూర్చోబెట్టి ఆటో కోసం వెళ్లాడు.

ఆటోలో ఆస్పత్రికి చేర్చి ఎక్స్‌రేలు, అన్ని టెస్ట్‌లు అయ్యేసరికి సాయంత్రమైంది. క్యారియర్ తెచ్చాడు పర

మేశ్వరం.

"ఆపరేషన్ చెయ్యాలి. స్క్రూ వేసి అతికిస్తాం. ఆమెకి భోజనం పెట్టకూడదు" అన్నారు డాక్టర్లు.

పంకజం తినకుండా పరమేశానికి భోజనం చెయ్యబుద్ధికాలేదు. భార్య బలవంతం మీద ఏవో రెండు మెతుకులు తిని మిగిలిన క్యారేజీ అన్నం అంత అక్కడ పనివాళ్లకి ఇచ్చేశాడు.

రాత్రి ఏడుగంటలకి పంకజాన్ని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లారు. పరమేశం బైట కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

ఎప్పుడు తనకి ఒక్క కష్టం లేకుండా తన కష్టసుఖాలు తనవిగానే అనుకుని అన్నిటా తానే అయి నిలిచిన తన భార్య, తన సర్వస్వం ఈనాడు ఏమిటిలా అయిందని ఆయనకి మనసు మనసులో లేదు. అతుక్కోవడానికి ఎన్నాళ్ళు పడుతుందో? పరిపరి విధాల ఆలోచనలు పోతున్నాయి. విదేశాలలో ఉన్న కొడుక్కి, అత్తవారింట ఉన్న కూతుర్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని చెప్పలేదు.

ఇప్పుడు ఇదివరకులా సిమెంట్ కట్లు వేసి నెలల నెలలు ఆస్పత్రిలో ఉంచడం లేదు. చిన్న ఆపరేషన్ చేసి లోపల ఎముకకి స్క్రూవేసి బిగించి వారం రోజుల్లో ఎక్సర్‌సైజులు అవీ చేయించి వాకర్‌తో నడవమని చెబుతున్నారు. ఆమె నడిచేవరకూ ఎలాగూ నాకు తప్పదు అనుకున్నారు ఆయన. ఆమెని ఇంటికి తీసుకొచ్చాక పిల్లలకి చెప్పాలని నిర్ణయించుకున్నారు.

రాత్రి తొమ్మిదింటికి స్ట్రెచర్ మీద పంకజాన్ని థియేటర్‌లోంచి బయటికి తీసుకొచ్చి ముందుగా బుక్ చేసుకున్న రూంలో బెడ్ మీద పడుకోబెట్టారు. కొంతసేపటికి స్పృహ వచ్చింది. డాక్టరు చెప్పిన మందులు, టైం ప్రకారం ఆహారం అన్నీ శ్రద్ధగా చూస్తూ అందిస్తున్న భర్తని చూసి మనసులో అనుకుంది పంకజం. 'ఇంత అభిమానంతో ప్రేమతో చూసుకుంటున్న భర్త సాన్నిధ్యంలో కన్నా కారులూ, బంగళాలలో తృప్తి, ఆనందం ఉంటుందా' అని. అదే తృప్తితో ఆ మాట భర్తతో అంది.

"అబ్బ! ఇప్పటికైనా గ్రహించావు. సంతోషం" అన్నాడు పరమేశ్వరం.

వారంరోజులకి డిశ్చార్జ్ చేశారు. వీల్‌ఛెయిర్‌లో మెల్లిగా ఇంట్లోకి తీసుకొచ్చి వాకర్‌తో మెల్లగా నడక ప్రాక్టీస్ చేయించాడు పరమేశ్వరం. ఆమెకి అంతా నయమయ్యాక కూతురికి, కొడుక్కి తెలియజేశాడాయన.

"అదేమిటి నాన్నా! వచ్చి మేం సాయం చేసేవాళ్లం కదా. మాకెందుకు చెప్పలేదు. మీరు ఎంత ఇబ్బంది పడ్డారో?" అంటూ కొడుకు, కూతురు ఫోన్‌లోనే తగవేసుకున్నారు.

కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, పిల్లలు పంకజాన్ని చూడడానికి వచ్చారు. పంకజాన్ని రెస్ట్ తీసుకోమని కూతురు, కోడలు పన్లన్నీ చూసుకున్నారు వారం రోజుల పాటు.మధ్యాహ్నం ఒకరోజు కబుర్లలో పరమేశ్వరం అన్నాడు

"మీ అమ్మకి ఈ సంవత్సరం రాశిఫలాలలో వాహన యోగం ఉందిట. అది ఏమిటో తెలుసా? మీ అమ్మ కారుయోగం వస్తుందని ముచ్చటపడింది.

తీరాచూస్తే స్ట్రెచర్, వీల్‌ఛెయిర్ యోగం పట్టింది. అవి కూడా వాహనయోగాలేగా మరి" అని.

అంతా ఫక్కున నవ్వారు.

"చాల్లెండి మీ జోకులు" అంటూ ఉడుక్కుంది పంకజం.

"అంతేకాదు. నా రాశి ఫలంలో ఆదాయం రెండు, వ్యయం పన్నెండు అని ఉంది. అది కూడా అక్షరాలా నిజమైంది.

ఆస్పత్రి ఖర్చులు, మందులు, ఆపరేషన్‌ఖర్చు, ఫిజియోథెరపీ ఖర్చు ఇలా అన్నీ కలిసి లక్ష అయింది" అన్నాడు పరమేశం.

"అయితే పంచాంగంలో రాసిన రాశిఫలాలు ఇద్దరికీ నిజమయ్యాయన్నమాట. పోనీలెండి అక్కడితో పీడపోయింది" అన్నారు పిల్లలిద్దరూ.

"అందుకే మన పెద్దలు కీడెంచి మేలెంచమన్నారు" అన్నాడు పరమేశ్వరం.

**- ఆర్.ఎస్.హైమవతి (చెన్నై)**

# పసుపు-కుంకుమ

అరవై ఏళ్ళు దాటిన వాళ్ళు పసిపిల్లలతో సమానం అని ఎవరన్నారో తెలీదు గానీ ఎప్పుడూ లేని మొండి వయ్యిదల 'వద్దు' అన్న పనే చెయ్యాలనిపించడం తలుచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తోంది. పెద్దబ్బాయి రఘు దగ్గర ఏ చీకూ చింతా లేకుండా కాలం వెళ్ళబుచ్చుకొస్తున్నాను. మేనకోడలే కోడలు రోజా.

"మావయ్యా...ఎండ ఎక్కువగా ఉంది. ఎక్కువ దూరం తిరగకు. కావాలంటే సాయంకాలం చల్లబడ్డాక అలా తిరిగిరా" అంది రోజా.

ముందే చెప్పానుగా! వద్దన్న పనే పిల్లాడిలా చెయ్యాలనిపించడంతో ఇలా తిరగడానికి వచ్చి బుద్ధి తెచ్చుకున్నాను. నోరెండిపోతోంది. ఓ గోళీ సోడా తాగుదామని కిళ్ళీ బడ్డీ దగ్గరకి వెళ్ళి సోడా ఇమ్మని అడిగిందే తడవుగా చల్లని సోడా చేతిలో పెట్టాడు. మెల్లగా తాగుతూ ఓ ప్రక్కనే నిలబడ్డాను. ఓ కాలేజీ కుర్రాడొచ్చి "పసుపు-కుంకాలున్నాయా?" అని అడగడం 'ఉన్నా'యన్నట్లే బడ్డీవాడు తల ఊపడం ఆ కుర్రాడు డబ్బులిచ్చి "చెరొకటి ఇవ్వు" అనడంతో రెండు పొట్లాలు చేతిలో పెట్టడంతో వెంటనే వెళ్ళిపోయింది.

నాకు ఆశ్చర్యం వేసింది. పూర్వం మా ఊరిలో మునలయ్య శెట్టి దుకాణంలో పప్పులు, పచారీ సామాన్లతో పాటు పసుపు, కుంకుమ అమ్మేవాడు. కిళ్ళీ బడ్డీ రాము అరటిపళ్ళ గెల వేలాడదీసేవాడు. ఇతరత్రా కొన్నిరకాలు వాడు అమ్మేవాడు. కాలం మారిపోయింది. ఫలానా వస్తువు, ఫలానా వాళ్లే అమ్మాలని లేదు. 'కిళ్ళీబడ్డీలో కూడా పసుపు కుంకుమలు అమ్ముతున్నారన్నమాట' అని స్వగతంలో అనుకుంటూ పోనీలే ఇకమీదట కోవెలకి వెళ్లేటప్పుడు ఇంటినుంచి తెచ్చుకోకపోయినా ఇక్కడ కొనవచ్చు. అనుకుని సోడాసీసా, డబ్బులు బడ్డీ కొట్టువాడికిచ్చి మెల్లిగా నడుచుకుంటూ ఇంటికి చేరాను.

* * *

సాయంకాలం షికారుకని బయలుదేరితే మనవడు రవి "తాతయ్యా! నేనూ వస్తా" అంటూ వెంటపడ్డాడు.

వాడొస్తే నాకేం బరువు కాదు. నాకు తోడుగా వుంటాడు కూడా. కానీ 'నాకు అదికావు. ఇది కొను' అని తల్లప్రాణం తీస్తాడు. అయినా సరే... 'పద' అని బయలుదేరాం.

"తాతయ్యా చాక్లెట్ కొనవూ" అనడంతో ఎదురుగా ఉన్న పాన్ షాప్‌లోకి వెళ్ళి వాడికి కావాల్సింది కొని చిల్లర పుచ్చుకుంటుండగా ఓ పాతికేళ్ళవాడు వచ్చి 'కుంకం' ఒకటి అని అడగడం వాడో ప్యాకెట్ చేతిలో పెట్టడం వాడు జేబులో వేసుకోవడం జరిగిపోయాయి.

నాకో నాన్న అనుమానం వచ్చింది. 'మొన్నటికి మొన్న ఓ కుర్రాడు పసుపు-కుంకుమ నా ముందరేకొన్నాడు. ఏదో దేవాలయానికి వెళతాడు కాబోలు పరీక్షలముందు కదా!' అనుకున్నాను. ఇతగాడు చూస్తే ఏదో కంపెనీలో ఫిట్టర్‌లా ఉన్నాడు. చేతినిండా గ్రీజ్ ఉంది. వీడు ఏ దేవాలయానికి ఇప్పుడు వెళ్ళే పరిస్థితిలో లేడు. మరి కుంకం ఎందుకొన్నాడబ్బా.' అని అనుమానం నా మనస్సుని దొలిచేస్తోంది.

రకరకాల ప్రశ్నలు అందుకే ఆ ఫిట్టర్‌లో "ఏమయ్యా ఈ బడ్డీలో కూడా పసుపు-కుంకుమ అమ్ముతారా?" అని అడిగేసరికి నావంక ఎగాదిగా చూసి వెళ్ళిపోయాడే తప్ప జవాబు లేదు.

* * *

"అమ్మా రోజా ఈరోజు శుక్రవారం కదా. ఓసారి అమ్మవారి గుడికి వెళ్ళి వస్తానమ్మా" అని చెప్పి బయలుదేరాను. నాకళ్లముందే ఎంతోమంది రోజూ పసుపు-కుంకుమ కొని తీసుకుని వెళుతున్నారు. ప్రజల్లో భక్తి బాగా పెరిగింది. మనస్సులో ఆలోచనలతోనే గుడి దగ్గరికి చేరుకున్నా. ఎదురుగా పాన్‌షాపు.

పాన్‌షాపు వాడిచేతికి పదిరూపాయల నోటు ఇచ్చి "అబ్బీ పసుపు-కుంకుమ చెరొకటి ఇవ్వు" అనగానే ఎనిమిదిరూపాయలు నా చేతిలో పెట్టి మూసిన పిడికిలితో గభాలున రెండు పొట్లాలు నాచేతిలో పెట్టాడు. నా మతిపోయినంత పని అయింది అవి చూడగానే. పసుపురంగులో మెరిసిపోతూ రాజాఖైనీ ఒకటి, ఎర్రగా కుంకుమ రంగులో గుట్కా అని రాసి ఉన్న ప్యాకెట్ మరొకటి చూసి తెల్లమొహం వేసాను.

**- భళ్ళమూడి నాగరాజు (రాయగడ)**